


అగ్ని ప్రమాదం వల్లే బాలిక మృతి

- టిన్నర్, మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయి
- నందికొట్కూరు ఘటనపై వివరాలు వెల్లడించిన పోలీసులు

నందికొట్కూరు రూరల్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో బాలిక మృతిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, అయితే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో బాలిక మృతి చెందిందని పోలీసులు చెప్పారు. నందికొట్కూరు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అన్ని కోణాల్లో విచారించామని చెప్పారు. అమ్మాయి గదిలో ఉన్న పెయింట్‌లో కలిపే టిన్నర్ డబ్బా తెరిచి ఉండడం, అలాగే వెలుగుతున్న మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయని చెప్పారు. దీంతో బాలిక మంటల్లో కాలిపోయిందని చెప్పారు. బాలిక తాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రెండేళ్లుగా నందికొట్కూరులో తాత ఇంటి వద్ద ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోందని తెలిపారు. మూడేళ్ల క్రితం వెల్దుర్తి మండలంలో పదో తరగతి చదువుతున్నప్పటి నుంచి బాలిక, రాఘవేంద్ర అనే యువకుడు ప్రేమించుకుంటున్నారని చెప్పారు. ఈ సాన్నిహిత్యంతోనే గత ఆదివారం రాత్రి నందికొట్కూరులో బాలిక తాతగారి ఇంట్లో బాలికతో పాటు యువకుడు ఉన్నారని తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని నిర్ధారించామని చెప్పారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని చెప్పారు. నందికొట్కూరు సీఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, డీఎస్పీ రామాంజి నాయక్



ప్రభుత్వ జూనియర్ కళాశాల

సంకల్పం సిద్ధించాలి

- ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రణాళిక రూపొందించిన ఇంటర్మీడియట్ విద్యామండలి
- డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కార్యాచరణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యాభై శాతం మంది విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారు. దీంతో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇంటర్ విద్యా మండలి 'సంకల్ప్' పేరుతో డిసెంబరు నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు ప్రణాళికను రూపొందించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని సంకల్ప్ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు వారికి తర్ఫీదునిస్తారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయడమే ధ్యేయంగా సంకల్ప్ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ప్రారంభించింది.

మిగతా 6లో..

ప్రభుత్వ కళాశాలల్లో దారుణమైన ఫలితాలు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో ఏటా దారుణమైన ఫలితాలు చోటు చేసుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, నంద్యాల జిల్లాలో 21 కళాశాలలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి దాదాపు 12,500 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్నారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అరకొరగా ఉంది. వార్షిక పరీక్షల్లో 50 శాతం మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతుండడంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడేళ్లుగా ఉత్తీర్ణులైన విద్యార్థులు, నమోదైన ఉత్తీర్ణత శాతం వివరాలు కింది విధంగా ఉన్నాయి.

విద్యా సంవత్సరం	పరీక్షలకు హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
1) 2021-2022 (ఉమ్మడి కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	7,042	1,386	19.68
ద్వితీయ సంవత్సరం	6,340	2,218	34.98
2) 2022-2023 (ఉమ్మడి కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	4,372	1,243	28.43
ద్వితీయ సంవత్సరం	4,787	1,941	40.54
3) 2023-2024 (కర్నూలు జిల్లా)			
మొదటి సంవత్సరం	3,287	1,264	38.45
ద్వితీయ సంవత్సరం	2,397	1,314	54.81
4) 2023-2024 (నంద్యాల జిల్లా)			
మొదటి సంవత్సరం	1,677	764	45.55
ద్వితీయ సంవత్సరం	1,039	674	64.87



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ముహూర్తం ఖరారు

6

నల్లమల అందాల నడుమ భైరవ క్షేత్రం

- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి ఆలయం
- పర్యాటకులను కనువిందు చేస్తున్న తెలుగుగంగ జలాశయం



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనడంతో పాటు 48 గంటలలో రైతులకు సంబంధిత మొత్తాలను అందజేస్తామన్నారు. 65 వేల ఎకరాల్లో ఉన్న ఫ్రీ హోల్డ్ భూములపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. కెసీ కేనాల్ ఆధీనంలో ఉన్నభూముల ఆక్రమణపై కమిటీ ఏర్పాటుచేసి పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్లు, గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసి 50శాతం పనులు పూర్తిచేశామని తెలిపారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజకుమారి జిల్లా అభివృద్ధికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి పైపులైన్ నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తిచేయాలని మంత్రిని కోరారు. ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమగ్ర రక్షిత నీటి పథకాన్ని పూర్తిచేయాలని మంత్రిని కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలంలో నష్టపోయిన సోయాబీన్ రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, గిత్తా జయసూర్య, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పయ్యావుల

'రబీలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోండి'

రబీ సీజన్‌లో సాగునీటి కాలువల కింద ఉన్న రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా అభివృద్ధి సమావేశం అనంతరం జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. పయ్యావుల మాట్లాడుతూ తెలుగుగంగ కింద 84వేల ఎకరాలు, ఎస్సార్బీసీ కింద లక్ష ఎకరాలు, కేసీ కెనాల్ కింద 90 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు వారబందీ పద్ధతిలో మార్చి 31వరకు సాగునీటిని ఇచ్చేందుకు నీటిని విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. శ్రీశైలం జలాశయంలో కేవలం 27 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉందని, నీటి లభ్యతను బట్టి వరి పంటకు నీటిని విడుదల చేసే వివరాలను వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. అలగనూరు బ్యాలెన్స్ రిజర్వాయర్ మరమ్మతులకు రూ.3 కోట్ల ప్రతిపాదనలు గత ప్రభుత్వం విస్మరించిందని, ప్రస్తుతం 34 కోట్లకు చేరిందని చెప్పారు. కేసీ కెనాల్‌ను, గోరుకల్లు రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేశారన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కేసీ కెనాలకు సంబంధించి స్థిరీకరించిన ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు శాశ్వత పరిష్కారం అనిఅన్నారు. ఎమ్మెల్యేలు అందరూ మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తిచేస్తే కేసీ కెనాల్‌కు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.



కర్నూలు మార్కెట్ యార్డు

కొత్త పాలకవర్గాల ఎంపికకు కసరత్తు

- ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ యార్డులు
- కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- రిజర్వేషన్ల ఖరారుకు ఉత్తర్వులు జారీ
- ఇప్పటికే కలెక్టర్లకు నివేదిక అందజేసిన అధికారులు
- కూటమి పార్టీల్లో పదవుల పందేరం షురూ

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్కెట్ యార్డుల నూతన పాలక వర్గాల ఎంపికకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చైర్మన్, వైస్ చైర్మన్లు సహా డైరెక్టర్లను నామినేట్ చేయనున్నారు. త్వరలోనే నూతన పాలక వర్గాలు కొలువుదీరనున్నాయి. ఈ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ అధికారులు జిల్లాలో ఎన్ని మార్కెట్ కమిటీలు ఉన్నాయి.. 2022 ఆగస్టులో ఏ యార్డు ఏ కేటగిరికి రిజర్వేషన్ చేశారు.. తదితర వివరాలతో కలెక్టర్లకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. 11, 12 తేదీల్లో సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీల సమీక్ష నిర్వహించి ఆ తరువాత రిజర్వేషన్ల ప్రక్రియ మొదలు పెడతారని సమాచారం. దీంతో టీడీపీ కూటమి పార్టీల్లో నామినేటెడ్ పదవుల పందేరం షురూ అయింది. ఆశావహులు ఇప్పటికే రాష్ట్ర పెద్దలు, ఎమ్మెల్యేలను కలిసి ప్రయత్నాలు పదవుల కోసం చేస్తున్నారు.

కర్నూలు జిల్లాలో ఏడు, నంద్యాల జిల్లాలో ఎనిమిది కలిపి ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల్లో రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరిగితే.. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్‌లు అలంకారప్రాయంగా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల మార్కెట్లలో రెగ్యూలర్‌గా క్రయవిక్రయాలు జరిగితే మిగిలిన మార్కెట్ యార్డులు వారాంతపు మార్కెట్లుగా మారితే.. కొన్ని పేరుకే అన్నట్టుగా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ల పరిధిలో ఏటా రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ సెస్సు రూ.36 కోట్లు వస్తుంది. నంద్యాల జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డుల పరిధిలో ఏడాదికి రూ.2,600 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా రూ.26 కోట్ల ఆదాయం వస్తోంది.

రిజర్వేషన్లు ఖరారు చేయండి

ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల నియమాకాల్లో ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మిగిలిన పదవులు ఓపన్ కేటగిరి (ఓసీ)లో భర్తీ చేయాల్సి ఉంటుంది. మొత్తం స్థానాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ప్రతి మార్కెట్ కమిటీలో వ్యవసాయ / ఉద్యానవన శాఖ, కో-ఆపరేటివ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, పంచాయతీ / మున్సిపాలిటీల నుంచి నలుగురు ప్రభుత్వ అధికారులు, ముగ్గురు ట్రేడర్స్, 13 మంది రైతులు కలిపి 20 మంది డైరెక్టర్లు ఉంటారు. రైతుల నుంచి ఎంపికైన డైరెక్టర్ల నుంచే చైర్మన్, వైస్ చైర్మన్లను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉంటారు. రైతుల నుంచి ఎంపిక చేసే డైరెక్టర్లు, చైర్మన్ పోస్టులను ఏ కేటగిరికి రిజర్వేషన్ కల్పిస్తారో.. ఆ కేటగిరి నుంచే ఎంపిక చేయాల్సి ఉంటుంది. అలాగే రైతుల కోటా డైరెక్టర్లుగా ఎంపిక అవ్వాలం టే ఆ మార్కెట్ పరిధిలో సొంతంగా సాగు భూమి ఉండాలి. పాడిపరిశ్రమ రైతులు కూడా అర్హులే అయినప్పటికీ పశుసంవర్ధక శాఖ జేడీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ట్రేడర్స్ కోటా ఎంపికయ్యే డైరెక్టర్లు ఆ మార్కెట్‌లో ట్రేడింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

రాజకీయ జోక్యం ఉంటుందా..!

మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్ రిజర్వేషన్లు రొటేషన్ పద్ధతిలో ఖరారు చేస్తారా.. ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ఎంపిక చేస్తారా.. అన్నది చర్చగా మారింది. ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు వంటి కీలక మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలు తమకు అనుకూలమైన వ్యక్తులకే కట్టబెట్టేలా రిజర్వేషన్ల ఖరారు కోసం జిల్లా కలెక్టర్లపై రాజకీయ ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే రూ.కోట్ల ఆదాయం కలిగిన కీలక మార్కెట్ చైర్మన్ పీఠాలు బలమైన సామాజిక వర్గాలకు వెళ్తాయని, ప్రాధాన్యత లేని మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలు రిజర్వేషన్ కోటాలో ఎస్టీ, ఎస్సీ, బీసీలకు కేటాయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని రొటేషన్ పద్ధతిలో ఖరారు చేస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మిగతా 6లో..




నంద్యాల మార్కెట్ యార్డు

ఆధ్యాత్మికం


ఆలయ ప్రాంగణంలోని కోనేరు


ఈశ్వరస్వామి


చాగలమర్రి భైరవగుండాల క్షేత్రం ఏరియల్‌వ్యూ


పూజలందుకుంటున్న భైరవేశ్వరుడు

నల్లమల అందాల నడుమ భైరవ క్షేత్రం

- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి ఆలయం
- పర్యాటకులను కనువిందు చేస్తున్న తెలుగుగంగ జలాశయం

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవ గుండాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలనం నాటి భైరవీశ్వర ఆలయం ఇక్కడ ఉంది. రాచరికపు గుర్తులు ఉన్న అతిపూరాతన ఆలయం ఇది. పక్కన తెలుగుగంగ జలాశయం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మూడు కి.మీ దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవీశ్వర ఆలయాన్ని నిర్మించారు. ఇది అత్యంత పూరాతనమైనది. ఇక్కడ ఈశ్వరుడు, భైరవీశ్వరుడు కొలువుదీరారు. కొన్ని వందల సంవత్సరాల నాటి ఆలయంగా ఇక్కడి పెద్దలు చెబుతారు. పూరాణాల ప్రకారం శ్రీకృష్ణదేవరాయలు కాశీకి వెళ్లే సమయంలో మార్గం మధ్యలో విశ్రాంతి కోసం భైరవీశ్వర ఆలయం నిర్మించారు. నీటితో నిండిన రెండు గుండాలు ఉన్నాయి. గతంలో ఈ గుండాల్లో దేవతలు స్నానం ఆచరించి పూజలు చేసేవారని పూరాణాల్లో ఉంది. కృష్ణానది ఒడ్డున ఈశ్వర ఆలయం ఉండటం ఇక్కడి ప్రత్యేకత. శివాలయం పక్కన అమ్మవారు, సీతారాముల ఆలయాలు, అక్కదేవతలు, ఆంజనేయస్వామి గుడి కొలువై ఉన్నాయి. కాశీరెడ్డినాయన భైరవగుండాలను సందర్శించడం వల్ల గ్రామస్థులు కాశీరెడ్డినాయన గుడిని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని ప్రతాపరుద్రుడు సందర్శించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. కార్తీకమాస ఉత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయం చెంతనే తెలుగుగంగ జలాశయం ఉండటంతో నీటి సౌకర్యానికి కొదువలేదు. తెలుగుగంగ జలాశయం, భైరవ క్షేత్రాలు చూడటానికి కడప, కర్నూలు తదితర జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. చాగలమర్రి మండల కేంద్రం నుంచి సుమారు 8 కి.మీ దూరంలో భైరవ క్షేత్రం ఉంది. చాగలమర్రి నుంచి చింతలచెరువు గ్రామం మీదుగా భైరవగుండాలకు వెళ్లాలి. ఈ ఆలయం చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం పచ్చదనంతో పర్యాటకులను కనువిందు చేస్తూ ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న భూమా అఖిలప్రియ భైరవగుండాల క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలోనైనా భైరవ క్షేత్రానికి వెళ్లేందుకు తారు రోడ్డు, బస్సు సౌకర్యాలు, ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కృషి చేయాలని ఆశిస్తున్నారు.


ఆలయం ముంగిట తెలుగుగంగ జలాశయం

విద్యార్థుల వివరాలు పంపండి: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లో డ్రాప్ బాక్సుల్లోని ప్రతి పిల్లల వివరాలను పరిశీలన చేసి వాటివివరాలను నమోదు చేసి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్ పాల్ మంగళవారం ఆదేశిం చారు. డ్రాప్ బాక్సుల్లోని విద్యార్థుల వివరాలను సేకరించుటకు ప్రతి మండలం లోని ఒక నోడల్ అధికారిని నియమిం చామని, ఆ అధికారి తమకు కేటాయించిన మండలంలో సీఆర్ఎంటీ, వార్డు సెక్రటరీ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా తగు సమాచారం సేకరించడానికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికా రులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వలసలు వెళ్లిన విద్యార్థుల వివరాలను తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. ఆయా గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీతో ధ్రువీకరించాలన్నారు. గుర్తించిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబరును జనరేట్ చేయాలన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలను సేకరించి ప్రొఫార్మాలో నమోదు చేయాల న్నారు. ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని డీఈవో ఆదేశించారు.

ఆదోని మెడికల్ కాలేజీ పోస్టులు రద్దు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో జారీ చేసిన ఆదోని మెడికల్ కాలేజీ, ఆదోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పోస్టుల భర్తీని రద్దు చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ నెంబర్ 01/2023, 02/2023కు సంబంధించిన ఈ రెండు నోటిఫికేషన్ల భర్తీ రద్దు చేసినట్లు తెలిపారు. రద్దు చేయబడిన పోస్టుల వివరాలు ప్రస్తుతం భర్తీ చేస్తున్న కర్నూలు, నంద్యాలలోని మెడికల్ కాలేజీలు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, కర్నూలు గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ పోస్టుల ఖాళీలు, రోస్టర్ పాయింట్లు వివరాలు జిల్లాల వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. Https://kurnool.ap.gov.in and https://nandyal.ap.gov.in మరియు Https://kurnoolmedicalcollege.ac.in లో అభ్యర్థుల సమాచారం ఉంచినట్లు తెలిపారు.

ప్రాసిక్యూషన్ జిల్లా అడిషినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా సరళాదేవి



కర్నూల లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాసిక్యూషన్ కర్నూలు జిల్లా అడిషినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా సి.సరళాదేవిని నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలు జారీ చేశారు. ఈమె గతంలో న్యూఢిల్లీలోని గాంధీ భవన్ ఇన్‌చార్జిగా పని చేశారు. ఈ మేరకు ఈమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవితో పాటు ఆమె మొదటి అదనపు సెషన్స్ కోర్టు గ్రేడ్-1 పీపీగా కూడా బాధ్యతలు నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తన ఆదేశాల్లో పేర్కొంది. స్థానిక ఎ.క్యాంపులోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఈమెకు జిల్లాలోని పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆమెను కలిసి అభినందించారు.

మానవ హక్కులను పరిరక్షించుకుందాం

శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రతి ఒక్కరిపై ఉందని శాశ్వత లోక్ అధాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్య సమితి యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ప్రకటించిందని అన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మానవ హక్కులైన స్వేచ్ఛ, సమానత్వం, వివక్ష లేని సమాజం అవసరమని, ఈ ఏడాది 'మా హక్కులు - మన భవిష్యత్తు' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆ తర్వాత ఆయన మానవ హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డీసీపీవో శారద, ఎన్జీవో రాయపాటి శ్రీనివాస్, పలువురు పోలీసు అధికారులు, కామన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్త పాలకవర్గాల ఎంపికకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

కూటమి పార్టీల్లో పదవుల పందేరం

మార్కెట్ యార్డు కమిటీల నూతన పాలకవర్గాల ఎంపిక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేలు, రాష్ట్ర పెద్దల ఆశీస్సుల కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టారు. గత ఎన్నికల ముందు టీడీపీ కూటమి పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం అధికారంలోకి రాగానే మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఇస్తామంటూ హామీలు ఇచ్చారు. తాజాగా ఆ హామీ గుర్తు చేస్తూ పదవులు ఆశిస్తున్నారు. ఆదోనిలో కూటమి భాగస్వామ్యమైన బీజేపీ ఎమ్మెల్యే గెలిచారు. మార్కెట్ ఛైర్మన్ పదవి టీడీపీ, జనసేన, బీజేపీలు నాయకులు ఆశిస్తున్నారు. ఇక్కడ బీజేపీ నుంచి ఎమ్మెల్యే ఉండడంతో మార్కెట్ ఛైర్మన్ పదవి టీడీపీ ఆశిస్తోంది. అయితే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు మధ్య రాజకీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే సిఫారసు చేసే వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తారా..? టీడీపీ ఇన్‌చార్జి సిఫారసు చేసే వ్యక్తిని ఛైర్మన్‌గా ఎంపిక చేస్తారా అన్న రాజకీయ చర్చ నడుస్తోంది. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా రూ.16 కోట్లకు పైగా ఆదాయం కలిగిన మార్కెట్ ఇది. కర్నూలు మార్కెట్ యార్డు కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజవర్గాల పరిధిలోకి వస్తుంది. ఏ ఎమ్మెల్యే సిఫారసు చేసే వ్యక్తిని ఛైర్మన్‌గా ఎంపిక చేస్తారన్నది ప్రశ్నగా మారింది. ఏటా రూ.7 కోట్లకు పైగా ఆదాయం ఉంది. ఎమ్మిగనూరు, పత్తికొండ, నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పీఠాలు దక్కించుకోవడానికి మూడు పార్టీల్లోని ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

2022 ఆగస్టులో మార్కెట్ కమిటీ ఛైర్మన్ల రిజర్వేషన్ల వివరాలు

మార్కెట్ కమిటీ	రిజర్వేషన్
కర్నూలు	ఓసీ జనరల్
ఆదోని	ఓసీ జనరల్
ఎమ్మిగనూరు	ఓసీ మహిళ
మంత్రాలయం (కోసిగి)	బీసీ/మైనార్టీ మహిళ
కోడుమూరు	ఎస్సీ/ఎస్టీ జనరల్
పత్తికొండ	బీసీ జనరల్
ఆలూరు	ఓసీ జనరల్
నంద్యాల	ఓసీ జనరల్
ఆళ్లగడ్డ	ఓసీ జనరల్
డోన్	ఓసీ జనరల్
ఆత్మకూరు	బీసీ జనరల్
నందికొట్కూరు	ఓసీ మహిళ
బనగానపల్లె	ఓసీ మహిళ
కోవేలకుంట్ల	బీసీ మహిళ
పాణ్యం	ఎస్సీ మహిళ

సన్నాహాలు చేస్తున్నాం

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 ఆగస్టులో ఉమ్మడి జిల్లాలో వివిధ మార్కెట్ యార్డు కమిటీలకు నామినేటెడ్ పద్ధతిన అప్పటి ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈ ఏడాది జూన్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆ పాలకవర్గాలను రద్దు చేసింది. తాజాగా నూతన పాలకవర్గాల నియామకంలో భాగంగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్లకు పూర్తి వివరాలతో నివేదిక ఇచ్చాం. రిజర్వేషన్లు ఖరారు చేయగానే ప్రభుత్వానికి పంపుతాం.

- నారాయణ, ఏడీ, మార్కెటింగ్ శాఖ, కర్నూలు

ఆయా ఛైర్మన్ పదవులు కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలు

కేటగిరి	కర్నూలు	నంద్యాల	మొత్తం	మహిళలు
ఎస్సీ/ఎస్టీ	1	1	2	1
బీసీ	2	2	4	2
ఓసీ	4	5	9	4-5
మొత్తం	7	8	15	7-8

ఆయా జిల్లాల్లో డైరెక్టర్ల పదవులు కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలు

కేటగిరి	కర్నూలు	నంద్యాల	మొత్తం	మహిళలు
ఎస్టీ	5	6	11	6
ఎస్సీ	14	16	30	15
బీసీ	26	30	56	28
ఓసీ	46	52	98	49
మొత్తం	91	104	195	98


ఆదోని మార్కెట్ యార్డు

సంకల్పం సిద్ధించాలి

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులను గ్రేడులుగా విభజన

ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులను అధ్యాపకులు ఏ, బీ, సీ గ్రేడులుగా విభజిస్తారు. ఏ-గ్రేడులోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తారు. బీ-గ్రేడులోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా, సీ-గ్రేడులోని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడతారు. ఇందులో భాగంగా విద్యార్థులను అధ్యాపకులకు దత్తత ఇస్తారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణులయ్యేలా చేయాల్సిన గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉంది. సబ్జెక్టుల వారీగా ముఖ్యమైన అంశాలను బోధించడం, ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో డీవీఈవో, డీఐఈవో, ఆర్ఐవోలు కళాశాలల్లో అమలవుతున్న సంకల్ప్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఫలితాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు.



ఆళ్లగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల

అంశాల వారీగా విద్యాబోధన



విద్యార్థులకు ముఖ్యమైన అంశాల వారీగా విద్యాబోధన చేస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాం. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. అధ్యాపకుల ద్వారా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ రూపొందించి విద్యార్థులకు ఇస్తున్నాం. కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- అజయ్ కుమార్, ప్రిన్సిపాల్, ఆళ్లగడ్డ జూనియర్ కళాశాల

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సంకల్ప్ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రశ్నపత్రాలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఫలితాల ఆధారంగా మెరుగుపరచాల్సిన అంశాలను గుర్తించి విద్యార్థులకు బోధిస్తున్నాం. విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రగతిని తెలియజేస్తున్నాం.

-శ్రీనివాసులు, ప్రిన్సిపాల్, యర్రగుంట్ల జూనియర్ కళాశాల

ప్రతి కళాశాలకు క్వశ్చన్ బ్యాంకులు



సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ విద్యామండలి రూపొందించిన ప్రత్యేక క్వశ్చన్ బ్యాంకులను అందజేశాం. త్రైమాసిక పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడులుగా విభజించి అధ్యాపకులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. సబ్జెకుల వారీగా క్వశ్చన్ బ్యాంకులు అందజేసి, ప్రత్యేక తరగతుల నిర్వహణ, స్టడీ అవర్స్ ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

-సునీత, డీఐఈవో, నంద్యాల జిల్లా

కేర్ టేకర్లుగా అధ్యాపకులు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులను అధ్యాపకులకు దత్తత ఇస్తాం. వారు కేర్ టేకర్లుగా వ్యవహరిస్తూ ప్రతి విద్యార్థిపై శ్రద్ధవహిస్తారు. విద్యార్థులను ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా చేసి వారి అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన ఫలితాలు సాధించేందుకు సబ్జెక్టుల వారీగా ముఖ్యమైన అంశాలను బోధించేలా ప్రణాళిక అందజేశాం. ప్రభుత్వ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నాం.

-పరమేశ్వరరెడ్డి, డీవీఈవో, కర్నూలు జిల్లా

ముహూర్తం ఖరారు

- నేడు సాగు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలో 384 సంఘాల్లో 3,692 టీసీ సభ్యుల స్థానాలకు ఎన్నిక
- ఏర్పాట్లు చేస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడింది. అసెంబ్లీ సమావేశాలు, ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా ఇప్పటికే రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయి. 14న నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 3న వెల్లడించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కరసత్తు మొదలు పెట్టిం ది. 14న జరిగే ఈ ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం జారీ చేయనున్నట్లు కలెక్టరు పి.రంజిత్ బాషా మంగళవారం ఆంధ్రజ్యోతికి వివరించారు. కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాల పరిధిలో 1,212 ప్రాదేశిక నియోజకర్గం (టీసీ) సభ్యులు, నంద్యాల జిల్లాలో 262 సంఘాల పరిధిలో 2,480 టీసీ సభ్యులు ఎన్నుకోనున్నారు. ఓటర్లుగా కర్నూలు జిల్లాలో 1,32,112 మంది రైతులు, నంద్యాల జిల్లాలో 3,09,246 మంది రైతులను గుర్తించి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. టీసీ సభ్యుల ఎంపిక పూర్తి కాగానే సాయంత్రం సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే అవకాశం ఉంది. ఏ కారణాల వల్లనో ఆ రోజు ఎన్నికలు జరక గపోతే మరుసటి రోజు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే 17వ తేదీన కర్నూలు జిల్లాలో 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, నంద్యాల జిల్లాలో 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అలాగే కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో నాలుగు ప్రాజెక్టు కమిటీలను ఈ నెల 20న ఎన్నుకునే అవకాశం ఉంది. అయితే.. ప్రాజెక్టు కమిటీ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని అధికారులు తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించేందుకు కలెక్టరు పి.రంజిత్‌బాషా పర్యవేక్షణలో ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణలు ఇచ్చారు. జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశారు. ఆయా మండలాలకు సామగ్రి పంపించారు.


నీటి సంఘాల ఎన్నికలకు సామగ్రిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

డిగ్రీ మూడో సెమిస్టర్‌లో ఆరుగురు డిబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 3వ సెమిస్టర్లో 6 గురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. 7,650 మంది దరఖాస్తు చేసుకోగా 6,892 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ తీరును డీన్‌లోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- ఏడుగురికి గాయాలు

మద్దికెర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో చిన్న నారాయణ, చిన్న మల్లికార్జున, ఈశ్వరమ్మ, రంగమ్మ, రామాంజులు, కేశమ్మ, మద్దిలేటికి గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజి గాయాలపాలైన ఉపాధి కూలీలను పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం మదనంతపురం గ్రామంలోని ఉపాధి కూలీలు లింగాల వాగు వంకలో దాదాపు 160 మంది ప్రతిరోజు పనులకు వెళ్తున్నారు. అందులో భాగంగా వంకలోని కంప చెట్ల వద్ద పని చేస్తుండగా.. ఒక్కసారిగా తేనేటీగలు చుట్టుముట్టడంతో కొంత మంది ఉపాధి కూలీలు పరుగులు తీయగా.. మరి కొంత మంది దాకు న్నారు. అయితే.. ఏడు మందికి తేనేటీగలు దాడి చేశాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను టీడీపీ నాయకులు శ్రీనివాసులు, దేవేంద్ర, రంగప్ప, రామాంజులు, గోవింద్ పరామర్శించారు.

కారు, లారీ ఢీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై మంగళవారం ఉదయం కారు, లారీ ఢీకొన్న ఘనటలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాల నుంచి కర్నూలు వెళ్తున్న కారు కాల్వబుగ్గ గ్రామ కొమ్ముచెరువు వెళ్లే యూటర్న్ వద్ద పొట్టు లారీ అతి వేగంగా తిప్పడంతో లారీని కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న బషీర్ అహ్మద్, మున్వీర్, అబ్దుల్ ఖాదర్, మనోహర్, వెంకటేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యాభివృద్ధిలో తానా సేవలు అభినందనీయం

- టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి



స్కూల్ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న రవి పొట్లూరి, చిత్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్‌రెడ్డి, గౌరు వెంకటరెడ్డి తదితరులు

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో తానా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లల కోసం ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి మండల ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాలకు తానా (ఎన్‌ఆర్‌ఐ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమానికి గౌరు వెంకటరెడ్డితో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల జగదీశ్వరరెడ్డి, తానా ఎన్‌ఆర్‌ఐ సభ్యుడు పొట్లూరి రవి, వ్యాపారవేత్త ముప్పా రాజశేఖర్, మధు, తేజా నిషా హాజరయ్యారు. ముందుగా వీరికి పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారు విజయభారతి, పొదుపు మహిళలు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రముఖులు పాఠశాలను సందర్శించిన అనంతరం విరాళం చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బాలభారతి పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని పిల్లలకు తానా (ఎన్‌ఆర్‌ఐ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు కూడా బాగా చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యేసేపు, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

- 13న అన్నదాతలతో కలిసి కర్నూలులో భారీ ర్యాలీ
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో మంగళవారం నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, ఉచిత పంటల బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 13న శ్రీకృష్ణదేవరాలయ ధర్నా చౌక్ నుంచి భారీ సంఖ్యలో రైతులను సమీకరించి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు విక్రమసింహా రెడ్డి, జుబేర్ అహ్మద్, సోంపల్లి కృష్ణకాంత్‌రెడ్డి, ఎస్‌టీ.షేక్ అహ్మద్, యూనుస్‌బాషా, గ్రంథాలయ మాజీ చైర్మన్ సుభాష్ చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను విస్మరించిన ప్రభుత్వం

- 13న నంద్యాలలో ర్యాలీని జయప్రదం చేయాలి
- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు



పోస్టరును విడుదల చేస్తున్న కాటసాని

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని రైతులతో ఓట్లు వేయించుకుని వారిని పూర్తిగా విస్మరించిందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం కర్నూలు నగరంలోని చెన్నమ్మకూడలిలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతలు వివక్షకు గురవుతున్నా రని, రైతన్నలకు తోడుగా నిలిచి వారి సమస్యల పై వైసీపీ ప్రశ్నిస్తుం దన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13న రైతుల కోసం.. రైతులతో కలిసి నంద్యాలలోని ఉదయా నంద హోటల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అంద జేస్తామని చెప్పారు. రూ.20వేల పెట్టుబడి సాయం ఇచ్చే దాకా రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. అకాల వర్షాలతో తడిచి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదని అసహనం వ్యక్తం చేశారు. గాజుల శ్వేతారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, బెల్లం మహేశ్వరరెడ్డి, సాని శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, భీమేశ్వరరెడ్డి, సాహూరు వీరయ్య పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు

కర్నూలు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వంశీనాథ్, బాలు, హనుమంతులను అరెస్టు చేసి డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. మంగళ వారం సాయంత్రం డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ మధుసూదన్‌గౌడు, ఎస్‌ఐలు గోపినాథ్, చంద్రశేఖర్ రెడ్డిలు నిందితుల వివరాలు వెల్లడించారు. నిందితుడు హనుమంతుది కర్ణాటక రాష్ట్రం. ఈయన పైన కర్ణాటక రాష్ట్రంలో పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయి. ముగ్గురు నిందితులు జల్సాలు, వ్యభిచారానికి అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడని పోలీసులు గుర్తించారు. తాళాలు వేసుకున్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 28 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

మురుగు కాలువలో మృత శిశువు



మహిళలను విచారిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని మృత శిశువు కనిపించింది. పట్టణంలోని గడ్డ వీధిలో ఈఘటన చోటు చేసుకుంది. మురుగు కాల్వలో అప్పుడే పుట్టిన మగశిశువును స్థానికులు గుర్తించారు. శిశువును వెలికి తీయగా అప్పటికే మృత్యువాత పడింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ అధికారులు స్థానిక మహిళలను పూర్తి స్థాయిలో విచారించారు. విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

మహానంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలో నందిపల్లె గ్రామం వద్ద రైలు పట్టాలపై మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. యువకుడు తెలుపు, పసుపు రంగు టీ షర్టు, ఇటుక రంగు షార్ప్ ధరించి ఉన్నాడు. యువకుడి వయస్సు 25నుంచి 30 సంవత్సరాల్లోపు ఉంటుంది. కుడి చేతికి వాచ్, ఎడమ చేతికి రబ్బర్ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. తెలిపారు.

సినిమా తెచ్చిన తంట

వెలుగోడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలో పుష్ప-2 సినిమా తెచ్చిన తంట ఇరువర్గాలపై కేసుకు కారణమైంది. సినిమా బెనిఫిట్ షోను పురస్కరించుకుని సాబీర్ అనే యువకుడు పేపర్లు చల్లుతుండగా ఓ వర్గానికి చెందిన యువకులు అతనిపై దాడి చేశారు. ఈ సమస్య చిలికిచిలికి పెద్దగా మారి ఘర్షణకు దారి తీసింది. ఒక వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మరోవర్గం దాడిలో ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ విషయంపై ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ విష్ణునారాయణ దర్యాప్తు చేపట్టారు. అయితే ఓ వర్గం వారు తాము ఫిర్యాదు చేసిన వారిపై కేసును నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ కాపీ ఇవ్వాలంటూ స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో ఎస్‌ఐ వారికి నచ్చజెప్పి కేసు నమోదు చేసిన కాపీని అందజేశారు

నేడు కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

- స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై చర్చించే అవకాశం
- అమరావతికి బయలుదేరిన కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అభివృద్ధి, సంక్షేమం సహా ఏపీ విజన్-2047పై ప్రధానంగా చర్చించే అవకావం ఉంది. జిల్లాలో వివిధ శాఖల వారిగా అభివృద్ధి, చేపట్టాల్సిన ప్రగతి పనులు, గ్రామం, మండల, జిల్లా స్థాయిల్లో వివిధ వర్గాల ద్వారా సేకరించిన అభిప్రాయాల మేరకు విజన్-2047 నివేదికలతో కలెక్టరు పి.రంజిత్‌బాషా మంగళవారం అమరావతికి బయలుదేరారు. జిల్లాలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీరు, కరువు నివారణ పథకాలు, పరిశ్రమల ఏర్పాటు, గ్రామీణ, పట్టణ రహదారులు ప్రగతి.. ఇలా వివిధ శాఖలలో చేపట్టాల్సిన ప్రగతి పనులు, జిల్లాలో జరుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, సాధించిన విజయాలపై నివేదకలు సిద్ధం చేశామని, జిల్లా ప్రగతికి చేపట్టాల్సిప పనులు, తీసుకోవాల్సిన చర్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని కలెక్టరు రంజిత్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు. 11, 12వ తేదిల్లో రెండు రోజులు నిర్వహించే ఈ సమీక్ష సమావేశంలో ఏ రోజు ఏ శాఖలపై సమీక్ష నిర్వహిస్తారో అజెండా తయారు చేశారు. ముఖ్యంగా జీవో పవర్టీ - పీ4 పాలసీ, స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోకస్ పెట్టారు. వాటిపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉందని తెలుస్తుంది.

స్థూల ఉత్పత్తి విలువలో 14వ స్థానంలో కర్నూలు

కలెక్టర్ల సమీక్ష సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల్లో ప్రగతి, సంక్షేమం, స్థూల ఉత్పత్తి విలువ, ఆయా రంగాల్లో సాధించిన ప్రగతి విజన్-2047, పేదరికం లేని ఏపీ (జీరో పావర్టీ-పీ4 పాలసీ) తదితర అంశాలపై నివేదిక విడుదల చేశారు. వ్యవసాయం, పరిశ్రలు, సేవల రంగాల్లో స్థూల విలువ (జీవీఏ)లో జిల్లా 14వ స్థానంలో ఉంది. 2022-23లో స్థూల విలువ (జీవీఏ) వ్యవసాయం (అనుబంధ రంగాలు కాకుండా) రంగంలో రూ.17,447 కోట్లు (4.08 శాతం), పారిశ్రామిక రంగంలో రూ.9,978 కోట్లు (3.17 శాతం), సేవలు రంగంలో రూ.17,180 కోట్లు (3.57 శాతం) కలిపి మూడు రంగాల్లో రూ.44,604 కోట్లు (3.65 శాతం) స్థూల ఉత్పత్తి విలువ సాధించి 14 స్థానంలో జిల్లా ఉందని గణాంకాలు ద్వారా తెలుస్తోంది. అలాగే దేశీయ స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 2022-23లో రూ.47,514 కోట్లు ఉంటే 2028-29 నాటికి రూ.1,07,7862 కోట్లకు చేరుకోవాలని లక్ష్యాలను నిర్దేశించారు. ఉద్యాన పంటల సాగు లక్ష్యాలను 47 శాతం సాధించి 5వ స్థానంలో నిలిచింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో లేబర్ బడ్జెట్ ఈ నెల 9 నాటికి 59.15 లక్షల పని దినాలు వినియోగించుకొని 60.98 శాతంతో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉంటే.. 2025 మార్చి 31 నాటికి 97 లక్షల పని దినాలను వినియోగించుకోవాలని టార్గెట్ పెట్టారు. సీసీ రోడ్లు 884 మంజూరు చేస్తే 790 రోడ్ల పనులు మొదలు పెట్టి 89.37 శాతంతో రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచింది. ఇలా వివిధ శాఖల్లో సాధించిన ప్రగతి, లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం నివేదిక తయారు చేసింది. ఆ నివేదిక అంశాలతో పాటు కలెక్టర్లు తయారు చేసిన జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమం అంశాలపై సమగ్రంగా చర్చించే అకాశం ఉంది.

జిల్లా అభివృద్ధి నివేదికతో వెళ్తున్నా



సీఎం చంద్రబాబు నేడు అమరావతిలో నిర్వహించే జిల్లా కలెక్టర్ల సమీక్షకు జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చేపట్టాల్సిన పనులు, ఇప్పటికే సాధించిన ప్రగతి నివేదిక సిద్ధం చేశాం. ముఖ్యంగా జిల్లాలో కరువు, వలసల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై ప్రధానంగా చర్చి స్తాను. జిల్లాలో కరువు పూర్తిగా నివారించాలంటే అసం పూర్తి సాగునీటి ప్రాజెక్టులు, స్వయం ఉపాధి పథకాలు, పరిశ్రమలు కావాల్సి ఉంది. జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన పనులపై కూడా చర్చిస్తాను. ఇలా అన్ని శాఖలపై జిల్లాలో చేపట్టాల్సి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంగా సమీక్ష సమావేశం సద్వినియోగం చేసుకుంటాను. **- రంజిత్‌బాషా, కలెక్టరు, కర్నూలు**

ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్రుడులపై ఓ వ్యక్తి సోమవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కడప జిల్లా పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన రామకృష్ణ, అతని భార్య విషయంలో ఇటీవల పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. దీన్ని మనస్సులో ఉంచుకున్న రామకృష్ణ కోటకందు కూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్రుడులపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు.

వైసీపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

సంజామల, డిసెంబరు 10: అవుకు మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన అయ్యపురెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారు. మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగారు. దీంతో ఆయనను నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

సంజామల, అవుకు మండలాల సరిహద్దు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని చెప్పి సోమవారం రాత్రి సంజామల ఎస్‌ఐ తనను స్టేషన్‌కు రావాలని చెప్పి దాడి చేశారని, అలాగే కారును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారని అయ్యపురెడ్డి చెప్పారు. ఎస్‌ఐ రమణయ్యను వివరణ కోరగా దాడి చేయలేదని చెప్పారు. ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



సుబ్బరాయుడు

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలం లోని పెద్దకొప్పెర్ల గ్రామా నికి చెందిన కౌలు రైతు తలారి బాలసుబ్బరాయుడు (58) మంగళ వారం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకు న్నారు. బాలసుబ్బరాయుడు నాలుగేళ్లుగా తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప, శనగ తదితర పంటలు సాగుచేసేవారు. ఈపంటలు సాగు చేసేందుకు పెట్టుబడి కోసం తెలిసినవారి వద్ద సుమారు రూ.10 లక్షలకు వరకు అప్పు చేశారు. అయితే గత రెండేళ్లుగా మిరప పంట పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. దీంతో అప్పు ఎలా తీర్చాలో నన్న మనస్తాపంతో సుబ్బరాయుడు ఇంట్లో ఎవరూ లేని సమ యంలో పురుగుల మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సుబ్బరా యుడును కోవెలకుంట్ల ప్రభుత్వాపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

ఆదోని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన గోపాల్ (30)అనే యువకుడు మంగళ వారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన గోపాల్ అనే యువకుడు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసు కొని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గోపాల్ భార్య పద్మ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రామస్వామి ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమ్తితం తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదని చెప్పారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అడుగుకో గుంత.. ప్రయాణం సాగేదెలా?

● మరమ్మతులకు నోచుకోని వైనం ● ఇబ్బంది పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మసీదుపురం రహదారి

మహానంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగున గుంతలు పడ్డాయి. మోకాలోతు గుంతలు ఉండడంతో ప్రయాణం చేయాలంటే భయమేస్తుందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే గుంతల్లో నీరు చేరి గుంతలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నంద్యాల- కడప హైవే రహదారి నుంచి మహానంది మండలం మసీదుపురం గ్రామానికి లింకు రోడ్డు అధ్వానంగా మారింది. రెండు కిలో మీటర్ల దూరం వెళ్లాలంటే వాహనదారులు అష్టకష్టాలు పడ్తున్నారు. గత 30ఏళ్ల నుంచి రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండు కిలోమీటర్ల ప్రయాణం దాదాపు అరగంట సమయం పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహానంది- వ్యవసాయ కళాశాల రోడ్డు కూడా గుంతలు పడ్డాయి. బొల్లారం, శ్రీనగరం-తిమ్మాపురం గ్రామాల రోడ్లు మరమ్మతులు చేపట్టాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా వ్యవసాయ కళాశాల రోడ్డు



గుంతలు పడ్డ రోడ్డు

అభివృద్ధి ప్రణాళికల రూప కల్పనపై శిక్షణ

పాములపాడు: పాములపాడు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన కోసం మండల స్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రెండు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. 12, 13వ తేదీలలో పలు గ్రామ పంచాయతీలకు, 17, 18వ తేదీన మిగిలిన గ్రామ పంచాయతీలకు రెండు బ్యాచులుగా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈశిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తీర్మానాలు,వాటి పర్యవేక్షణ,సొంత మూల ఆదాయ ఉత్పత్తి,వివిధ ప్రభుత్వ పథకాలు,ఆరోగ్యం, పోషకాహారం విద్య, పారిశుధ్యంతో పాటు ఆయా గ్రామాలలో తాగునీటి సమస్యలపై ఈ శిక్షణలో చర్చించనున్నట్లు తెలిపారు.

నంద్యాల రూరల్: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆర్‌జీఎస్‌ఏ. కార్యచరణ ప్రణాళిక 2024-25లో భాగంగా మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, గ్రేడ్1, 4 పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థిరమైన లక్ష్యాల స్థానీకరణ థీమ్-2పై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 17, 18న నిర్వహించనున్న మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో అందరు పాల్గొనాలని కోరారు.

హక్కులకు భంగం వాటిల్లితే న్యాయ స్థానాలను ఆశ్రయించవచ్చు

నంద్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు భంగం వాటిల్లితే న్యాయస్థానాలను ఆశ్రయించి వాటిని పొందవచ్చని జిల్లా సాహితీ స్రవంతి సంఘం అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాస మూర్తి అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవహక్కులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన సమసమాజ జీవనవిధానానికి నాంది అని పేర్కొన్నారు. మానవ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేమంతరెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

కొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని వివిద చెరువులకు సంబంధించిన సాగునీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 11వ తేదీ బుధవారం ఆయా నీటి సంఘాల ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. 14న ఎన్నికలు ఉంటాయని వివరించారు. శివభాష్యం సాగర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 3 డబ్ల్యుయూఏలు ఉండగా.. ఒక్కొక్క దానికి 3 టీసీల చొప్పున 36 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే శివపురం ఈర్ల చెరువు కింద 6 టీసీలు, లింగాపురం మొండికట్ట కింద 6 టీసీలు, మల్లెలమ్మ చెరువుకు 6 టీసీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికల్లో 3,485 మంది పురుష రైతు ఓటర్లు ఉండగా.. మహిళా రైతులు 1208 మంది ఉన్నారనీ వీరందరూ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందని వివరించారు. టీసీకి పోటీ చేసే రైతు పేరు, ఏ నెంబరు టీసీలో ఉందో వాటికి మాత్రమే పోటీ చేయాలన్నారు. సదురు రైతు నీటి పన్నుతో పాటు ఎలాంటి కోర్టు కేసులు ఉండకూడదన్నారు. పోటీ చేసే రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు గానీ ఏదో ఒక్క గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తహసీల్దార్ వివరించారు. మరిన్ని వివరాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ కోరారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కత్తెర పురుగు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏడీఏ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని కౌలూరు, బలపనూరు గ్రామాలలోని జొన్న పంటలను పరిశీలించారు. పంటలో కత్తెర పురుగు(ఫాల్ ఆర్మీ వాల్) ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వీటి నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం, ఎస్‌జీ 0.4 గ్రాములు, లీటర్ నీటికి గానీ, క్లోరన్ ట్రానిలిప్రోల్ 18. 5 శాతం, 0.4 శాతం లీటరు నీటికి లేదా నోవలూరాన్ 5.25 శాతం, ఎస్‌జీ, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0. 9 శాతం ఎస్‌జి 1.5 లీటర్ నీటికి చొప్పున ఎకరాకు మొత్తం 200 లలీటర్ల నీటిని తగు మోతాదు పురుగు మందు కలిపిపిచికారి చేయాలన్నారు. ఎన్‌పిఎస్ఎ (నేషనల్ పెస్ట్ సర్వేలైన్స్ సిస్టమ్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ పైరులోని పురుగుల నిర్ధారణ, నివారణ చర్యల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాణ్యం మండల వ్యవసాయాధికారి జయప్రకాష్‌రెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ పుల్లయ్య, ఏఈఓ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగులకు నిర్వహించే జాబ్ మేళా అవకాశాలను అందిపుచ్చుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. నిరుద్యోగులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం జాబ్‌మేళా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఉపాధి కల్పనకు రెండు కంపెనీలు ప్రాతినిథ్యం వహిస్తున్నాయని, 80కిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.శశికళ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావులకు వినతి



మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఆర్థిక శాఖ, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఏపీయూడబ్ల్యూజే నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం నంద్యాలకు విచ్చేసిన మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్‌బాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబులు కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అర్హత ఉన్న జర్నలిస్టులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, ప్రెస్‌క్లబ్ కోసం స్థలం కేటాయించాలని, జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. మంత్రులు పయ్యావులు కేశవ్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌లు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కిశోర వికాసం.. బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది

ఆత్మకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం బాలికల బంగారు భవష్యత్‌కు పునాది లాంటిదని నంద్యాల జిల్లా ఐసీడీఎస్ పీడీ లీలావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కిశోర వికాసం కార్యక్రమంపై ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా పోలీసులకు, ఆశాలు, సచివాలయ సిబ్బందికి, ఏఎన్ఎంలకు, అంగన్‌వాడీ వర్కర్లు, మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కిశోర వికాసం ద్వారా రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్ మెరుగుపరచడానికి చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకునేలా, సమగ్రాభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం చేయాతనివ్వనున్నట్లు చెప్పారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసిన అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో సూర్యనారాయణ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో బాలాజీ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారీ, శివకుమారీ, కవిత, కోమలి, వినోలియా, అంజలి, రమాదేవీ తదితరులు ఉన్నారు.

గోస్పాడు: బాలికల చదువు దేశానికి వెలుగు అని అదనపు సీడీపీవో పద్మావతి, ఈవోఆర్డీ నాగఅనసూయ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కిశోరబాలికల వికాసం కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ఒక బాలిక విద్యావంతురాలైతే తర్వాత తన కుటుంబాన్ని అంతా విద్యావంతులను చేస్తుందన్నారు. అనంతరం కిశోర బాలికలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇవో అబ్దుల్‌కరీం, హెల్త్ సూపర్‌వైజర్ మద్దమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, హేమలత పాల్గొన్నారు.



ఆత్మకూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: బాల్యవివాహాలు చేయడం నేరమని ఎంపీడీవో గోపి కృష్ణ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరివికాసం అనే కార్యక్రమం నిర్వహించారు. కిశోరబాలికల ఆరోగ్యం, పోషణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, వెలుగు ఏపీఎం అంబమ్మ, అంగన్‌వాడీ, వెలుగుసీసీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గౌరు వెంకటరెడ్డికి సమస్యను వివరిస్తున్న బాధిత రైతు

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనుపూరులో కుంటలో సోమవారం ప్రమాదావశాత్తు రెండు ఎద్దులు పడి మృతి చెందాయని, ప్రభుత్వం ఆదుకోవాలని ఎద్దుల యజమాని పోలుగారి ప్రసాద్ కోరారు. మంగళవారం పాణ్యం టీడీపీ కార్యాలయంలో నందికొట్కూరు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి, టీడీపీ నియోజక వర్గ ఎస్సీ విభాగం కన్వీనర్ దానం కలిశారు. రెండు ఎద్దులు సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం చేయాలని వినతి పత్రం అందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరురూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌లు పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద 45 మంది గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భవతులు,బాలింతలకు పౌష్టికాహార సమతుల్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు తులసి,ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో

గడివేముల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంచాలకట్ట గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జొన్న, పొగాకు, మినుము, మొక్కజొన్న పంటలలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రైతులు పంటబీమా చేసుకోవాలని అన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు

నంద్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్పై మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 8పతకాలు సాధించినట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి నూర్‌బాష మంగళవారం తెలిపారు. ఈ నెల 7నుంచి 10తేదీల్లో హర్యాణాలోని పంచ్‌కులా తావ్‌దేవీలాల్ ఇండోర్ స్టేడియంలో స్పై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 25వ జాతీయ స్థాయి పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో 24రాష్ట్రాల నుంచి 800మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర జట్టులో నంద్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ వయస్సు, కేటగిరీల విభాగాల్లో ప్రాతినిథ్యం వహించి ఒక బంగారు, మూడు వెండి, 4కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులు స్పై ఫెడరేషన్ గ్రాండ్ మాస్టర్ మీర్‌నజీర్, ఏపీ స్పై చైర్మన్ ఇస్మాయిల్, రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీమ్ చేతులమీదుగా పతకాలు అందుకున్నారని నూర్‌బాషా తెలిపారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నంద్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రధర్ కోరారు. మంగళవారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను వడ్డెర సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. చక్రధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర జనాభా 30లక్షలమంది ఉన్నారని ముందు నుంచి వడ్డెరలు టీడీపీని గెలిపించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య పరంగా వడ్డెరలు వెనుకబడ్డారని వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న అధికారికంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని, సత్యపాల్ కమిటీని పునరుద్ధరించి వడ్డెరలకు ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

● ఆర్థిక బకాయిలు మంజూరు చేయాలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. మంగళవారం నంద్యాలకు వచ్చిన పయ్యావుల కేశవ్‌ను ఎస్టీయూ జిల్లా నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వేతన సవరణ, కరువు భత్యం, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ ప్రయోజనాలు, రుణబకాయిలు చెల్లించాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గోవిందపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆళ్లగడ్డ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో తరచు తనిఖీలు, దాడులు ని ర్వహిస్తూ బెల్ట్ షాపుల నియంత్రిస్తామన్నారు. ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాణ్యం గ్రామానికి చెందిన బొమ్మినేని శ్రావణి (33) అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం రచ్చకట్ట వీధిలో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గత కొంత కాలంగా భర్త బాల సుంకన్నతో విడిపోయి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

బైర్లూటి ఎకో టూరిజంలో వర్క్‌షాప్

ఆత్మకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని బైర్లూటి ఎకోటూరిజం కేంద్రంలో బుధవారం వన్యప్రాణి సంరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశానికి అటవీశాఖ అడిషనల్ పీసీసీఎఫ్‌లు రాహుల్ పాండే, శాంతిప్రియ పాండేలు హాజరయ్యారు. నాగార్జునసాగర్- శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని ఆత్మకూరు, గిద్దలూరు, నంద్యాల, మార్కాపురం ప్రాజెక్ట్ టైగర్‌ల పరిధిలోని ఫీల్డ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌లతో పాటు రేంజర్లకు అటవీ, వన్యప్రాణి సంరక్షణకు సంబంధించి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రత్యేకించి జనవరిలో జరగనున్న వన్యప్రాణి గణాంకాలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లు సమాచారం. ఇదిలావుంటే రెండు రోజుల పాటు జరిగే ఈవర్క్‌షాప్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు అటవీ అధికారులు గోప్యంగా వుంచడం గమనార్హం.

కొండపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్థానికేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కొండలో మంగళవారం మేకలు మేపడానికి వెళ్లిన బోయనాగరాజు ప్రమాదవశాత్తు కొండపై నుంచి కాలు జారి పడడంతో తీవ్ర గాయాలు అయినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. గాయపడిన నాగరాజును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ రఫి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14న కబడ్డీ ఎంపిక పోటీలు

నంద్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఏపీరెడ్డి మంగళవారం తెలిపారు. నంద్యాలలోని ప్రథమ నందీశ్వర దేవస్థానం ఆవరణలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. 1-1-2006 తర్వాత జన్మించినవారే ఉండాలని బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు ఉండాలన్నారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు తమతో ఆధార్ కార్డు, పదో తరగతి మార్కులిస్టు వెంట తెచ్చుకోవాలని కోరారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని, ఎంపికైన జట్టు ఈ నెల 22 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమాచారం కోసం 9849548926, 9704098059 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

15 రోజుల్లో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు 15 రోజుల్లో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరవుతాయని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మంగళవారం పాణ్యం కృష్ణాలయంలో సదస్సు నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్‌ను పునర్మించాలని ఎస్సీ కాలనీ ప్రజలు సదస్సులో వినతి పత్రం అందజేశారు. కాలనీలోని మౌలలిక సదుపాయాలను ఆయన పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు. కుల, ఆదాయ, కుటుంబ, తదితర ధృవపత్రాలు సదస్సులోనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాణ్యం దేవాదాయ శాఖకు చెందిన పాణికేశ్వర, రామస్వామి, సత్యనారాయణ, పడవెంకటాద్రి, వీర నారాయణ స్వామి ఆలయాల భూములకు పట్టాదారుపాసు పుస్తకాలకై ఈఓ రామకృష్ణ దరఖాస్తు చేసుకున్నారన్నారు. 1957 తర్వాత అసైన్డ్ భూములను ప్రభుత్వం రిజిస్ట్రేషన్ నిలిపివేసిందన్నారు. సర్వేసు దరఖాస్తులు సచివాలయాలలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో అంది పరిష్కారం కాని స్పందన ఫిర్యాదులను ఈ సదస్సుల్లో పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ అనూరాధ, ఆర్ఐ రాము, సబ్‌రిజిస్ట్రార్ నరేంద్రనాథ్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ రైతు సదస్సులను ఆయా గ్రామాల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి వివరించారు. మంగళవారం రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలోని పాతమాడుగుల గ్రామంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్నతో కలిసి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసర్వే కొలతల కోసం రైతుల నుంచి పది అర్జీలు వచ్చాయన్నారు. అలాగే భూములు ఆన్‌లైన్ కోసం 20 అర్జీలు, భూవిస్తీర్ణంలో తేడాల కోసం 7 అర్జీలు వచ్చాయని వివరించారు. మొత్తం 37 అర్జీలు రాగా, వీటిని మళ్లీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వో మౌలాలి, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలోని ఆయా రెవెన్యూ గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కే.సుధారాణి, తహసీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు.తహసీల్దార్ మాట్లాడుతూ..మండలంలోని ఆయా రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి ఏవైనా భూసమస్యలపై అర్జీలు అందించినట్లయితే వాటిని పరిశీలించి 45 రోజుల్లోగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ఆంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు అన్నారు. లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవైన పొలం సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొనివస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 10 మంది రైతులు వివిద సమస్యల పై దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంగారెడ్డి, వీఆర్వో మద్దిలేటి తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను తీసుకొస్తే భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో మంగళవారం సర్పంచ్ ప్రకాశం అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల సమస్యలకు సంబంధించి 24 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, సత్యదీప్, సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గడివేముల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ ప్రజలకు సూచించారు. మండలంలోని గడిగరేవుల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలుంటే దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని అన్నారు. రెవెన్యూ సదస్సులో భూకొలతలకు, మ్యూటేషన్‌లకు 31 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.

పాములపాడు: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో రైతుల నుండి 7 అర్జిలు స్వీకరించారు.పొలాల సర్వే కోసం రెండు అర్జిలు, మ్యుటేషన్ కోసం ఒకటి,ఆన్‌లైన్ మార్పు కోసం మూడు,పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఒకటి చొప్పున అర్జిలను రైతులు ఈ సదస్సులో సమర్పించారని వీటన్నింటిని పరిశీలించి ఆయా సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామి,డీటీ పఠాన్‌బాబు,ఆర్ఐ ఖాజాబీ,సర్వేయర్లు సుప్రియ,కలిముల్లా, వీఆర్‌వోలు మగ్బుల్ హుసేన్,శివన్న, ముర్తుజా,మద్దిలేటి పాల్గొన్నారు.



పాణ్యంలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

బాల్య వివాహాలను అరికట్టాలి : సీడీపీవో



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీడీపీవో శంషాద్ బేగం

బేతంచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరిగే బాల్య వివాహాలను పిల్లల తల్లిదండ్రులు అరికట్టాలని సీడీపీవో శంషాద్ బేగం సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాలల వికాసం అనే కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించారు. సమావేశంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, ఎంఈవో సోమశేఖర్, ఏపీఎం మధుసుదర్శన్‌గౌడు, ఏవో దస్తగిరి బాబు, ఐసీపీఎస్ సునీల్ కుమార్, రంగాపురం పీహెచ్‌సీ వైద్యురాలు ఆలీమ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

సంజామల : బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో సాల్మన్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై పీహెచ్‌సీ డాక్టర్ క్రిష్ణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత, సుగుణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల చిత్రమ్మ

బేతంచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టీడీపీ డోన్ నాయకురాలు కోట్ల చిత్రమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వివిధ గ్రామాలు, పట్టణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నాయకురాలు కోట్ల చిత్రమ్మ పాల్గొని మాట్లాడారు. కొంతమంది మహిళలు ఇళ్ల వద్దనే ఉంటూ జూట్ బ్యాగులను తయారు చేస్తున్నారని, వాటికి మార్కెటింగ్ కూడా కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నిరుద్యోగ మహిళలకు వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు అనురాధ, మహిళలు ఉన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం: సీఐ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సీఐ, రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని సీఐ వెంకటేశ్వరరావు, ఎంఈవో సోమశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ధరణి కాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అబ్రహం అధ్యక్షతన రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో 20 మంది బాలికలకు సైకిళ్లను సీఐ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సీఐను ఎంఈవో సోమశేఖర్ శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డిలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు విజయనాగరాజు, సత్తార్, మాణిక్యం శెట్టి, మక్బూల్, రామ్మూర్తి, రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హోంగార్డులకు శారీరక దారుఢ్యంపై శిక్షణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్‌లోని హోంగార్డులకు పట్టణంలోని వైపీపీఎం కళాశాల మైదానంలో శారీరక దారుఢ్యంపై అధికారులు మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నంద్యాల హోంగార్డ్స్ శిక్షణ అధికారి రవీంద్ర పర్యవేక్షణలో పోలీస్ పెరేడ్ నిర్వహించారు. హోంగార్డులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నజీర్, జోసెఫ్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆళ్లగడ్డ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో తరచు తనిఖీలు, దాడులు నిర్వహిస్తూ బెల్ట్ షాపుల నియంత్రిస్తామన్నారు. ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదు చేయించుకోండి

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని కంపమళ్ల, భీముని పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంపమల్ల సుబ్బారెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

కిలో టమోటా రెండు రూపాయలు

- ప్యాపిలి మార్కెట్‌లో పడిపోయిన ధర - గగ్గోలు పెడుతున్న రైతులు



మార్కెట్‌కు తీసుకొచ్చిన టమోటా

ప్యాపిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మార్కెట్‌లో టమోట ధరలు పడిపోయాయి. మంగళవారం కిలో టమోటాలు కేవలం రెండు రూపాయలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర గుండె కోతకు గురయ్యారు. టమోటాలను మార్కెట్‌కు తరలించాలంటే 25కేజీల గంపకు ఆటోకు రూ.20 చార్జీ చెల్లించాలి. అయితే మార్కెట్లో టమోటా ధరలు పూర్తిగా పడిపోయాయి. కిలో రూ.2పలికితే రవాణా చార్జీలు కూడా చెల్లించలేకపోతున్నామని డోన్, ప్యాపిలి, తుగ్గలి తదితర మండలాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా మార్కెట్లో ధరలు ఇలాగే పలుకుతున్నాయని వారు వాపోయారు. ధరలను చూస్తుంటే దిగుబడులను మార్కెట్‌కు తరలించాలంటే భయంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టమోటా ధరలు పాతాళానికి పడిపోయిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆ పాఠశాలలో నలుగురు విద్యార్థులు

● ఒకే ఉపాధ్యాయుడు

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి ఎస్సీ కాలనీలోగల ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. మంగళవారం నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 1 నుంచి 5వ తరగతి వరకు నలుగురు మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది జూన్ నెల ప్రారంభ సమయంలో కూడా విద్యార్థుల సంఖ్య 14 ఉండేది. పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు, స్కావెంజర్ తొలగింపు విషయంలో రాజకీయ రంగు పులుముకుంది. దీంతో పాఠశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థులను ఆయా పార్టీలకు సంబంధించిన తల్లిదండ్రులు టీసీలు తీసుకొని వెళ్లిపోవడంతో నలుగురు విద్యార్థులు మాత్రమే మిగిలారు. పాఠశాలలో ప్రస్తుతం 2వ తరగతిలో ఇద్దరు, 3వ తరగతిలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారికి ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. వంట ఏజెన్సీ మహిళ ఆ నలుగురికే భోజనం తయారు చేసి అందిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గురించి ఎంఈవో అనూరాధను వివరణ కోరగా ప్రస్తుతం నలుగురు విద్యార్థులు ఉండటం వాస్తవమే అన్నారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలో 1 నుంచి 5 వతరగతి వరకు 14 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించమని తల్లిదండ్రులకు అవగాహన కూడా కల్పించామని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.



ముగ్గురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు సుబ్బయ్య



పెద్దవంగలి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల

జొన్నల కల్తీపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోవెలకుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలగటూరు గ్రామంలోని కల్తీజొన్నల కేంద్రంపై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మనాయకులు మంగళవారం దాడులు చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వెలగటూరులో కల్తీ జొన్నల కేంద్రం అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం వెలగటూరు గ్రామంలో తనిఖీ చేపట్టారు. కుప్పగా ఉన్న జొన్నలకు శ్యాంపిల్ ప్యాక్ చేసి స్టేట్ ఫుడ్ ల్యాబ్ కంట్రోల్ కేంద్రానికి పంపుతున్నట్లు తెలిపారు. జొన్నల కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఓంశ్రీ సాయిరాం ట్రేడర్స్ దూదేకుల భాస్కర్, రమణ, వెంగళరావులకు నోటీసులు జారీ చేశారు. వీరితో పాటు మరో జొన్నల కేంద్రం నిర్వాహకులకు కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. లైసన్సు పొందిన తర్వాతనే ట్రేడింగ్ చేయాలని కోరారు. ల్యాబ్ టెస్టింగ్ పంపిన జొన్నల నివేదిక వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని కూర్మనాయకులు తెలిపారు.



జొన్నల శ్యాంపిళ్లను తీస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నాయకులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం: బీసీ ఇందిరమ్మ



ప్రతిజ్ఞ చేయిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని ఇందుకు ప్రతి విద్యార్థి సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం బీసీ ఇందిరమ్మ ప్రారంభించిన నా బనగానపల్లె - నా ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. విద్యార్థులతో మాటామాట కలిపి వారికి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేందుకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులు పేపర్ బ్యాగులు, జూట్‌బ్యాగులను వినియోగించాలన్నారు. కొన్ని రోజులుగా పట్టణంలోని కిరాణం, క్లాత్ మర్చంట్, నాన్‌వెజ్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తల శ్రేయస్సుకు కృషి

కొలిమిగుండ్ల: బీసీ కుటుంబానికి కార్యకర్తల అండే కొండంత బలమని, వారి శ్రేయస్సు కోసం బీసీ కుటుంబం అహర్నిశలు కృషి చేస్తుందని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో పర్యటించిన ఆమెకు టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించిన బీసీ ఇందిరమ్మ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం నంద్యాల ప్రసాదు ఇంటిలో జరిగిన వేడుకలో బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ అభివృద్ధికి సహకారం అందించాలి





ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ధర్మవరం సుబ్బారెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. మంగళవారం మొదటిసారి ఇన్‌చార్జి మంత్రి హోదాలో నంద్యాలకు వచ్చిన మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆర్ అండ్‌డీ అతిథి గృహంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులతో పాటు సమస్యల పరిష్కారానికి అమలు చేయాల్సిన కార్యాచరణను ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. అనంతరం నంద్యాలలోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష, నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు.

డోన్ రూరల్: నంద్యాల ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఏపీ సీడ్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట టీడీపీ డోన్ పట్టణ నాయకులు సీఎం శ్రీనివాసులు తదితరులున్నారు.

బేతంచెర్ల : నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను బేతంచెర్ల మండల టీడీపీ నాయకులు జిల్లా కేంద్రంలో మంగళవారం కలిశారు. ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వారిలో ఏపీఎస్ఎస్‌డీసీఎల్ చైర్మన్ సుబ్బారెడ్డి, మండల సమన్వయ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, టీడీపీ నాయకులు నంద్యాల మధు, శెట్టి తదితరులున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు



శెట్టివీడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవికుమార్



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కొలిమిగుండ్ల తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతుల సమస్యలు పరిష్కరించడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం శెట్టివీడు గ్రామంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, దేవాదాయశాఖ ఈవో సాయిచంద్ర, మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, కార్యదర్శి ఆదినారాయణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని నందిపాడు గ్రామంలో తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో సర్వేయర్ సరిత, వీఆర్వో ప్రసాదరెడ్డి, సర్పంచ్ గుర్విరెడ్డి, మాధవరెడ్డి, శివారెడ్డి రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని నరసాపురం గ్రామంలో తహసీల్దారు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతుల నుంచి 12 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం శాంతకుమారి, డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, సర్వేయర్లు మల్లికార్జున ప్రసాద్, రమణ వీఆర్వోలు ఓబయ్య, సంజీవరెడ్డి, హుసేన్ పాల్గొన్నారు.

శిరివెళ్ల : రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పుష్ప కుమారి తెలిపారు. మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంజామల: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం ఆకుమళ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 18మంది రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సర్వేయర్లు మల్లేశ్వరీ, క్రిష్ణయ్య వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గువ్వల సుబ్బారెడ్డి, సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో తహసీల్దారు భారతి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రుద్రవరం మండలం నరసాపురంలో అవగాహన ర్యాలీ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సంజామల తహసీల్దార్ అనిల్ కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉద్యానవన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకం

- ఉద్యానవన శాఖ అధికారి ధరణి



కొలిమిగుండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి ధరణి సూచించారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి హెచ్‌వో మాట్లాడారు.

ప్రశ్న : పండ్ల తోటలకు ప్రభుత్వం అందించే రాయితీలు ఏవిధంగా ఉన్నాయి ..?

జవాబు : ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ అందిస్తోంది. మామిడి, దానిమ్మ, సీతాఫలం, ఉసిరి, చీనీ, అంజూర, చింత, జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్స్ పంటలు సాగు చేసే రైతులకు ఉద్యానవన శాఖ 40శాతం రాయితీ అందిస్తుంది.

ప్రశ్న : ఫారంపండ్స్, కలెక్షన్ సెంటర్లు, కోల్ట్ స్టోరేజీల నిర్మాణాలకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉందా?

జవాబు : ఉద్యానవన శాఖ రైతులు నిర్మించుకునే ఫారం పండ్స్‌తో పాటు, పాలీహౌస్‌లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలకు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వం 50 శాతం వీటి నిర్మాణాలకు సబ్సిడీ అందిస్తున్నారు. మరోవైపు ప్యాట్ హౌస్ (30ఇంటు20 షెడ్లు) నిర్మించుకునే రైతులకు రూ.2 లక్షలు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్న : ఉద్యానవన పంటల సాగుపై రైతుల ఆసక్తి ఎలా ఉంది?

జవాబు : ఉద్యానవన పంటలతో పాటు, ఇతర పథకాలకు సంబంధించి రైతులకు అవగాహన కలిస్తున్నాం. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినం



డీఎస్పీ శ్రీనివాసులుకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న వినియోగదారుల సంఘం నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమగ్ర వినియోగ దారుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు సాధన గిరి రామకృష్ణారెడ్డి, వినియోగదారుల రక్షణ సంఘం నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజుల ఆధ్వర్యంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులును సన్మానించి బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు డీఎస్పీ తీసుకుంటున్న చర్యలు హర్షణీయమన్నారు.

చాగలమర్రి: మండలంలోని నగల్లపాడు అనాథాశ్రమంలో జిల్లా మానవ హక్కుల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శెట్టివీడులో పంట కోత ప్రయోగం



శెట్టివీడులో వరి ధాన్యాన్ని కొలత వేస్తున్న ఏఈవోలు

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో వరిపంటపై ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో ఏఈవో మంజుల, వీహెచ్‌ఏ మహేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం పంటకోత ప్రయోగం చేశారు. రైతు నాగ భూషణంరెడ్డి పండించిన వరి పంటలో పంటకోత ప్రయోగం చేశారు. వరి ధాన్యాన్ని కొలతలు తీశారు. మంచి దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసినప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో నాగేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్.నాగలవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. అనుకొని పరిస్థితుల్లో ధాన్యం తడిస్తే వాసన రాకుండా క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు వాడాలని సూచించారు. చెడిపోకుండా మొలకెత్తకుండా ఇలా చేసుకోవచ్చన్నారు. రైతులు ఈ నెలాఖరులోగా పంటలకు బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

రుద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో ఈ నెల 14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. మండలంలో 16 చెరువులు 13 తెలుగుంగ కాల్వలకు మొత్తం 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉంటాయని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు కల్పించాలని పోలీసులకు కూడా సూచించినట్లు తహసీల్దారు తెలిపారు.

రైతులు బీమా చెల్లించాలి

డోన్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన ఉద్యాన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని డోన్ ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి సూచించారు. మంగళవారం ఉద్యాన శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మామిడి తోటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తింపునకు ఎకరాకు రూ.2,250 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉల్లి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద హెక్టారుకు రూ.225లు ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు.

రూపనగుడిలో డైరెక్టర్ల నియామకానికి ఎన్నికలు

ఉయ్యాలవాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామంలో విజయ డెయిరీ డైరెక్టర్ల నియామకానికి ఈ నెల 31న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం గ్రామంలోని రెండు డైరెక్టర్లకు వేసిన నామినేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కాటబోయిన నారాయణ, ఎగ్గోని శేషమ్మ, దాసరి వెంకట సుబ్బారెడ్డి వేసిన నామినేషన్లు అర్హులుగా గుర్తించామన్నారు. దీంతో గ్రామంలోని రెండు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలో 15 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.